32

# మిడి మిడి జ్ఞానం

ఒక ఊరిలో మిడతంభట్టు అనే విద్యార్థి గురుకులంలో సంస్కృతం నేర్చుకుంటుండేవాడు.

అతను పరమ ఛాందసుడు. అయినదానికీ, కాని దానికీ తాను చదువుకున్న సంస్కృత గ్రంథాలలోని ప్రమాణ వాక్యాలను వల్లిస్తుండేవాడు.

ఆ రోజుల్లో వున్న ఆచారం ప్రకారం- మిడతంభట్టుకి పిన్న వయస్సులోనే పెళ్ళి అయింది. సంక్రాంతి పండుగకు కొత్త అల్లుడిని రమ్మని అత్తవారు మిడుతంభట్టుని ఆహ్వానించారు.

ఆ రోజుల్లో రైళ్ళూ, బస్‌లూ లేవు. అందువల్ల అత్తవారి ఊరికి కాలి నడకన ప్రయాణమయ్యాడు భట్టు.

కొంతదూరం వెళ్లేసరికి.., మార్గమధ్యంలో ఒక చచ్చిన గాడిద కనిపించింది. దిక్కూ మొక్కూ లేకుండా అది అలాపడి వుండడం చూసేసరికి, 'అనాధ ప్రేత దహనాయ కోటి యజ్ఞ ఫలం లభేత్' అన్న సూక్తి జ్ఞాపకానికి వచ్చింది మిడితంభట్టుకి. దాని అర్థం... దిక్కులేని శవాలను దహనం చేస్తే కోటి యజ్ఞాలు చేసిన ఫలం లభిస్తుంది- అని!

వెంటనే దహనం చేసే ఉద్దేశంతో దానిని ఈడ్చుకు పోసాగాడు.

మరికొంత దూరం వెళ్లేసరికి, బరువైన ఆ శవాన్ని ఈడ్చుకుపోవడం చాలా కష్టం అనిపించింది. వెంటనే మిడతంభట్టు మనసులో 'సర్వాని అంగాని శిరః ప్రధానం!' అన్న సూక్తి మెదిలింది. దాని అర్థం... దేహ భాగాలన్నింటిలో తల ప్రధానం - అని!

వెంటనే నేల మీద పడి వున్న ఒక తాటిమట్టను తీసుకుని, రంపంలాంటి దాని అంచుతో ఆ గాడిద తల నరికి నెత్తిన పెట్టుకుని తీసుకు పోసాగాడు.



ఇంకొంచెం దూరం వెళ్లేసరికి , ఆ గాడిద తలను మోసుకు వెళ్లడం కూడా కష్టం అనిపించింది. వెంటనే 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం !' అన్న వాక్యం జ్ఞాపకానికి వచ్చింది. దాని అర్థం... అన్ని అవయవాలలోను కన్ను ముఖ్యమైనది – అని !

వెంటనే ఆ గాడిద గ్రుడ్లు పీకి , మూట కట్టి ఎలాగైతేనేం... అత్తవారింటికి జేరుకున్నాడు మిడతం భట్టు. ఎవరూ చూడకుండా ఆ మూటను ఇంటి చూరులో దాచాడు. మర్నాడు వాటిని తీసుకుని వెళ్లి, దహనం చేయాలని అతని ఉద్దేశం.

అల్లుడు వచ్చాడు కదా... అని అత్తవారు మిడతంభట్టు భార్యకు చక్కగా అలంకారం చేశారు. రాత్రి ఆమె పడుకోడానికి వచ్చింది.

అంతటి అందమైన భార్యని చూసేసరికి 'భార్యా రూపవతీ శత్రుః !' అన్న వాక్యం జ్ఞాపకానికి వచ్చింది అతనికి. దాని అర్థం... 'అందమైన భార్య శత్రువు – అని !

అందుకని ఆమె అందం చెడగొట్టడం కోసం ఒక ఊచ తీసుకొని భార్య కన్నొకటి పొడిచాడు. ఆమె బాధతో గోల పెట్టుండగా మిడతంభట్టుకి మరో వాక్యం జ్ఞాపకానికి వచ్చింది- 'ఏకాక్షీ లోకసంహారి!' అని. దాని అర్థం... ఒక కన్ను ఉన్నవారు లోకాన్ని నాశనంచేయగలరు- అని!

వెంటనే ఊచతో రెండో కన్ను కూడా పొడిచాడు.

ఆమె గోడుగోడునా ఏడుస్తూ కంగారుగా అక్కడినుండి పారిపోబోయింది.

గుడ్డిదైపోయిన ఆమె వంటికి బుడ్డిదీపం తగిలి క్రింద పడింది. అందులోంచి నూనె వలికిపోయి అంటుకుని వెంటనే ఇల్లంతా కాలిపోసాగింది. దాంతో ... మిడతంభట్టుతో సహా ఇంట్లోని వారందరూ బయటకు పరిగెత్తారు.

అత్తవారిల్లు పూరిపాక కావడంతో చూస్తూండగానే బూడిద అయిపోయింది.

తెల్లవారాక మిడతంభట్టు వచ్చి ఆ బూడిదని కెళ్ళరిస్తూ వెతక సాగాడు. ఇంట్లోని వారూ, ఇరుగు పొరుగు వారు అది చూసి "దేనిని వెదుకుతున్నావు?" అని అడిగారు.

"గాడిద గ్రుడ్లు!" అని గంభీరంగా సమాధానం చెప్పాడు మిడతంభట్టు.

ఆ జవాబు విని అతనేదో కోపంలో వున్నాడనుకొని ఊరుకుని అతని వంకే వింతగా చూస్తుండసాగారు.

ఆ బూడిదలో గాడిద గ్రుడ్లు కనిపించక పోవడంతో అవి కాలిపోయాయన్న నిర్ధారణకు వచ్చాడు మిడతంభట్టు. అంతే! ఆనందంతో... "అనాథ ప్రేత దహనం అయింది" అంటూ గంతులు వేయసాగాడు.

అది చూసి నలుగురూ గట్టిగా నిలదీసేసరికి.., గాడిద గ్రుడ్ల వ్యవహారం బయటపెట్టాడు మిడతంభట్టు. అది విని, అటువంటివాడు ఊరిలో వుంటే ప్రమాదమని నలుగురూ అతన్ని బాగా తన్ని, ఊరి నుంచి తగిలేశారు.

పాండిత్యం అవసరమే...కాని, మిడిమిడి జ్ఞానం పనికి రాదు. అనేక వాక్యాలను అనేక సందర్భాలలో ఉపయోగించడం జరుగుతుంటుంది. వాటిని ఉపయోగించిన సందర్భం తెలుసుకుని, అందుకు అనుగుణంగా దానిని తీసుకోవాలి. ఉదాహరణకి - "ఆలస్యం అమృతం విషం!" అన్నారుకదా...అని ప్రతి పనిని తొందర తొందరగా, కంగారుగా చేయకూడదు. అలాగే... "నిదానం ప్రధానం!" అన్నారుకదా... అని అన్నిటినీ ఆలస్యంగా చేయకూడదు. సమయం - సందర్భం తెలుసుకుని ప్రవర్తించాలి. లేకుంటే... మిడతంభట్టుకి పట్టిన గతే పడుతుంది.

★★★